# పండుగ మరునాడు

నిద్ర మెలకువ వచ్చేసరికి ఆకాశం తెల్ల చీరలా వుంది. తూర్పు దిక్కు ఎర్ర కొంగులాగా వుంది. దాని మీద జరీబుట్ దారు పువ్వులా సూర్యుడు పైకి వస్తున్నాడు. అయ్యో! నిన్న నీపాటికి ఎంత హడావుడి? అల్లుడికి. మామకి తలంట్లు అయాయి. తను తెల్లవారు ఝామున మూడింటికే పోసుకుంది. వంటా. పిండి వంటా అవాలికదా? వార్తలొచ్చేసరికి వంట సగం అయింది. పిల్లలందరూ మామిడి కాయలు సేకరించడంలో. వేపపువ్వు తేవడంలో. చెఱుకు గడలు ముక్కలు చేయడంలో. బెల్లం తరగడం హడావిడిలో పడిపోతున్నారు. రెండోవాడు తెల్లవారేసరికి నొసకారే మామిడి పిందెలు తుంపుకొచ్చాడు. ఎవరి దొడ్లోవో! అవి బజారులో కొన్నవి కావని నాకు తెలుసు. అసలు వాడికి డబ్బులియ్యందే: కూరలతో పాటు ఆయనే తెచ్చారు. అయినా పండగపూటా పొద్దున్నే వాడిని ఏమి అనను? నేనో చూపు చూసేసరికి తల వంచుకు చక్కాపోయాడు. వీధిలోకి కనిపిస్తూ చెట్లకి మామిడికాయలు వేళ్ళాడుతూంటె కుర్రవాళ్ళకి తోచదు. యజమానుల కళ్ళుగప్పి గడకర్రో. రాయి విసిరో వాటిని రాల్చందే వూరుకోరు. సరే వేప పువ్వుకి తప్పేది లేదు. వాసంక్రరకి చివర కత్తి కట్టి ధ్వజంలా పుచ్చుకు బయలుదేరి చాటెడు పువ్వు తెస్తారు. చిన్న చిన్న వేపపూలు ఎంతో అందంగా వుంటాయి. చిన్నగా. తెల్లగా పులిపిరి కాగితంలా తెల్లగా వుండే పూలు. పచ్చగా పూసల్లా వున్న మొగ్గలు. లేత వేపచిగుళ్ల అదొక విధమైన పరిమళం. ఆ గాలి గుండెలనిండా నింపుకోవాలనిపిస్తుంది. ఆ సుకుమారమైన వేపపూలని నలిపాలంటే చేతులు రావు నాకు. పోనీ ఓ రెండు రెబ్బలు ఉగాది పచ్చడిలో వేద్దామంటే కాడలు కనిపిస్తే పిల్లలు చిరాకు పడతారు. చారులో కాని. పులుసులోకాని కొత్తిమెర. కరివేపాకు కాడలు కనిపించ కూడదు. పిచ్చిపిల్లలు ఏవో అలవాట్లు- వాటికి భిన్నం కాకూడదని పట్టుదల - పెద్దయాక జీవితం ఎలా గడుపుతారో ఏమో!



ఏమిటీ నాకీ ఆలోచన! అసలే ఆలస్యంగా లేచి! అవతల అల్లుడుకూడా వున్నాడు. ఏమనుకొంటున్నాడో ఏమో! ఇక పని పాట చూసుకోవద్దు! అనుకొని సుభద్ర కప్పుకొన్న దుప్పటి మడిచి దిండుమీద పెట్టి లేచి నడుం దగ్గర చీరకట్టు ఒకసారి వడ్డాణం

**టి. బి. జ్ఞానప్రసూన**

లాగా అటూఇటూ తిప్పుకొని ఆవలించింది. కాస్త చలనంవచ్చింది శరీరానికి. వంటింట్లో కెళ్ళేసరికి రమ స్టౌ దగ్గర కూర్చుని కాఫీ కలుపుతోంది. గబ గబా మొఖం కడుక్కొని బొట్టుపెట్టుకొని రమతో - "అల్లుడికి కాఫీ ఇచ్చావుటే!" అంది.

"ఆయన నాలుగుగంటల బండికే వెళ్ళారమ్మా! నిన్నంతా అలసిపోయి నిద్రలో వున్నావు - అందుకని నే చెప్తాలెండి అన్నాను."

"అయ్యో! నిన్న ఈ పాటికి ఎంత సరదాగా తిరుగుతున్నాడే! అంత తెల్లవారే సరికే వెళ్ళిపోవాలా! అదేం ఆఫీసే తల్లీ! అంది.

"ఆఫీసంటే ఆఫీసే!! ఇదుగో కాఫీ త్రాగు" అని కాఫీ అందించింది రమ.

సుభద్ర కాఫీగ్లాసు అందుకుని నోటి దగ్గర పెట్టుకుని వాకిలివంక చూసింది. వాకిట్లో ముగ్గులేదు.

"ఎరికమ్మరాదులా వుందే! జ్ఞాపకమే లేదు" అని గడగడా కాఫీత్రాగి చీపురు పుచ్చుకొంది సుభద్ర. "అంతతొందరేమిటే అమ్మా! కాఫీకూడా స్థిమితంగా తాగవు. ఒక్క నిముషం ఆలస్యం అయితే ఏమవుతుందేం! నీకు చాదస్తం. అతి ఖంగారూనూ!"

"బావుందమ్మా! వీధిలో ముగ్గు లేకుండా ఎప్పుడేనా ఇలా వుందా? ఆ బాల్చీతో నీళ్ళు ముగ్గుబుట్టా ఇలా పట్రా" అని హడావుడిపడి వాకిట్లో ముగ్గు వేసింది సుభద్ర. ఈ లోగా రమ గిన్నెలు శుభ్రం చేసి. వంటిల్లు వూడ్చి ముగ్గు వేసింది. సుభద్ర స్నానంచేసి కూరలబుట్ట ముందేసుకుని కూర్చుంది. అందులో ఒక్క చేమదుంపలు మినహా మరేమీ లేవు. నిన్న పిండి వంటలకి నూనంతా వంపేసింది. కారియర్ ఖాళీ!

లడ్డు కట్టడానికి చప్పిడి బూంది దూశాక కాస్త పిండి మిగిలితే ఇంత ఉప్పు. కారం వేసి బియ్యంపిండి కలిపి కారబ్బూంది దూసింది. ఏదో పనివుండి రమకి అప్పచెప్పి అలా పది నిముషాలు వెళ్ళితే అది బూంది దుయ్యను చెయ్యి కడుక్కోనూ నీళ్ళారుతూ చెయ్యి ఆ పిండిలో నాలుగుసార్లు పెట్టేసరికి అది నీళ్ళు నీళ్ళు అయింది. మళ్ళీ ఇంత పిండి కలిపితేగాని పాకాన పడలేదు. ఇలా చేశావేమే అంటే "పోనీ ఆ కాస్త పిండి వదిలెయ్యరాదూ పండగెళ్ళేదాకా బూంది దూస్తూనే వుంటావాఅంది. పారేసుకొంటే ఎలా! సామ్మా: మాటలా? అదంతా దూసేసరికి బోలెడు నూనెలాగేసింది. ఈ చేమ దుంపలు వేపక పోతే అందరూ ఈ ఎత్తున లేస్తారు. "చేమవేపుడూ కొంప మాపుడూ" సామెత ఊరికే రాలా! పోనీ ఆయన కూరేమన్నా తెస్తారేమో! అనుకొని చావడిలోకి వెళ్ళింది సుభద్ర. ఆయన ఈజీఛైర్లో కళ్ళు మూసుకొని పడుకొన్నారు. చేతిలో కళ్ళజోడు చేతిలోనే వుంది.

"కూరేమన్నా తెస్తారా!" అంది నెమ్మదిగా.

శివుడు మూడోకన్ను తెరిచినట్లు రావు గారు రెండు కళ్ళు తెరిచి.

"తేవడానికి తెల్లారిందీ! అన్ని అయిపోయాయి- బుట్టెడు కూరలూ" అని వత్తి పలికారు కోపంగా.

"అవవ్వా మరి! సాయంత్రం ఆ పంచ పాండవుల్ని నా నెత్తికెక్కిస్తారాయె! మనమయితే ఒక కూరతో సరిపోయేది వాళ్ళకి

*ఇంట్లో అందరూ ఏ రోజు సంతోషంగా వుంటే ఆ రోజే పండుగ- అది అందరికి పండుగ మరునాడైనా సరే!*

నాలుగు కూరలూ తరిగితే కాని కాలా" అంది

"నే వెళ్ళలేను. ఏదో ఒకటి తొందరగా అఘోరించు నీ అల్లుడికి నల్లంచు గ్లాస్గో పంచకోసం నిన్నల్లా తిరిగి తిరిగి కాళ్ళు నెప్పులు పుట్టాయి. రానన్న అల్లుడు తెల్లారకుండా ఉగాది పురుషుడిలా ఊడిపడ్డాడాయె" అని మళ్ళీ కళ్ళుమూసుకున్నారు రావుగారు.

"సాయంత్రానికి బియ్యంకూడా తేవాలి" అంది. "నువ్వు నన్ను బ్రతకనియ్యవే! అవీ అయిపోయాయా?"

"బావుంది అవక వుంటాయా? జీతాలు రాలేదు బాంక్ స్ట్రైయికు పండగపద్దుల్లు ప్తంగా చెప్పమంటే. కొంచెం కొంచెం చెప్పానా! పండగరోజు అది కాస్తామరచిపోయి అందర్నీ పిలిస్తిరి. పండగపూట పనివాళ్ళకి తలో సోలెడు బియ్యం ఇయ్యకపోతే వూరుకొంటారా? ఇంకా కుంకుళ్ళు. నూనెలు. ఇయ్యటం ఎప్పుడో మానేశాను."

"వాళ్ళు - ఆపు. నిన్న ఆ పురాణశ్రవణం, ఇవాళ ఈ పురాణ శ్రవణం వెళ్ళిపొయ్యి మీదదేదో మాడి తగలడ్తుంది" అన్నారు రావుగారు.

సుభద్ర వేడి నిట్టూర్పు విడిచి లోపలకెళ్ళింది. ఈయనకేమీ అర్థంకాదు. అవతల కాపురం చేస్తున్న ఆడపిల్ల వున్నగన్ని ఆలోచనేలేదు అవ్వ అనుకొని సుభద్ర చేమదుంపలు ఉడకేసి. పొట్టుతీసి ఇంత పసుపు కరివేపాకు వేసి తిరగమూతలో పడవేసింది. తల నరాలన్నీ గింజుకుపోతున్నాయి. కళ్ళు పొయ్యిసెగకి నీళ్ళు కారుతున్నాయి. నిన్నటి చాకిరితో నడుం విరగడానికి సిద్ధంగా వుంది. వంట అవగానే కూతుర్ని పిలిచి "నాన్నగారికి నీళ్ళు తొలిపి పీటలు - కంచాలు పెట్టమ్మా! ఈ పని అయితే కాసేపు విముక్తి" అంది.

రమ లోపలికి వెళ్ళి "నారాయణ రానంటున్నాడే!" అంది. తతిమ్మా వాళ్ళు అసలు అయిపులేరు. సుభద్ర ఆదుర్దాగా గదిలోకి వెళ్ళింది. నారాయణ మంచం చివరగా పడుకొని మూలుగుతున్నాడు. సుభద్ర వాణ్ణి తట్టి లేపి.

"ఇక్కడే వున్నావుట్రా! ఇంకా ఆడుకోటానికి వెళ్ళావేమో అనుకొన్నాను మూలుగుతున్నావేం! ఎలావుందిరా!" అని రెక్క పుచ్చుకు లేవదీసింది. వాడు జోగుతూ లేచాడు. కంటి రెప్పలు వాచాయి. సుభద్ర నుదురు. పొట్ట చూసింది. గోరువెచ్చగా వుంది. రెండు చేతులా పొట్ట నొక్కుకొంటూ బాధగా నారాయణ మూలిగాడు.

"కడుపు నొప్పా?"

"ఊ! మరె! నిన్ననేమోనే గోపిగాడి దగ్గర కెడితే వాళ్ళమ్మ రెండు ఆవడలూ, పులిహార పెట్టిందే!" అన్నాడు.

"మరింకేం! ఇక్కడ లడ్డూలు అవి తిన్నావుగా: అతక లేదులా వుంది" అంది. ఇంతలోవాడు తల్లి చేతులమీద వమనం చేసుకొని కళ్ళు తిరిగి పడిపోయాడు. సుభద్ర చేతులు గబగబా కడుక్కొని కుర్రవాణ్ణి భుజాన వేసుకొని, దొడ్లో బట్టలు ఆరవేస్తున్న రమని పిల్చి.

"డాక్టరు దగ్గరకి వెళ్ళి వస్తానే: నారాయణకి గిరవచ్చి పడిపోయాడు మీ నాన్నగారికి అన్నంపెట్టు" అని రోడ్డుమీద కనిపించిన రిక్షా ఎక్కి వెళ్ళింది. డాక్టరు వున్నాడు. ఈయనకి సెలవలేదు కామోసులే: అని పిల్లవాణ్ణి అక్కడ బల్లమీద పడుకోబెట్టింది. చీరంతా నల్లగా వుంది. చీర మార్చుకోకుండా వచ్చేసింది తను. డాక్టరు మందు ఇచ్చి. టాబ్లెట్స్ వ్రాసి



యిచ్చాడు. నాలుగు గంటలకొకసారి వెయ్యమని వెళ్ళిన రిక్షాలోనే తిరిగి వచ్చింది సుభద్ర. రావుగారు భోంచేసి పేపరు చదువుతున్నారు.

"ఏమన్నాడు:" అన్నారు పేపరులోంచి తల ఎత్తకుండానే.

"మందు ఇచ్చాడు" అంది సుభద్ర. కొడుకుకు మందు తాగించి పడుకోబెటి మళ్ళీ కుంపటి వెలిగించి జావ పడేసింది. రమ, సుభద్ర కంచాల దగ్గర కూర్చునేసరికి తక్కిన పిల్లలు బిలబిల మంటూ వచ్చారు. సుభద్రకుభోజనంసయించలేదు. పెద్దకొడుకు గిరి వుంటే ఇలాటప్పుడు ఏదో మందు వేసేవాడు. తనకి ప్రాణం స్థిమితంగా వుండేది. వాడు పండుగకి రానేలేదు. చెయ్యి తుడుచుకొని వక్కపలుకు నోట్లోవేసుకొనేసరికి తాయారు తయారయింది. పండగకి పుట్టింటికి వచ్చిందట. చూసి పోదామని వచ్చిందట. నిన్న తల్లి కొనిపెట్టిన వెంకటగిరి జరీ చీర ముక్కుపొడుం రంగుది కట్టుకువచ్చింది. రమ చాప వేసి కూర్చోమంది. తాయారు అందరివంకా చూస్తూ—

"బాగున్నారా!" అంది.


## ఉగాది కార్డులు



### తెలుగు సంవత్సరాదికి తెలుగులో శుభాకాంక్షలు

ఉగాది ప్రెజెంటేషన్ సెట్ రు. **18**
(ఎక్స్‌పోర్టు క్వాలిటీ: 12 రకాల కార్డులు)

2. ఉగాది ఎస్సార్టెడ్ సెట్ రు. **10**
(12 కార్డులు)

3. శృంగారనాయికల సెట్ రు. **12.50**
(8 కార్డులు)

## ఉగాది కేలండర్‌లు

*1978 April — 1979 March*

టేబుల్‌పైన పెట్టుకోడానికి, గోడకు తగిలించుకోడానికికూడా వసరైన కొత్తరకం కేలండర్‌లు.

1. "భక్తిరంజని" రు. **5.00**
(6 పేజీలు—6 చిత్రాలు: పేజీకి 2 నెలలు)

2. "వసంత విహారి" రు. **7.50**
(12 పేజీలు—12 చిత్రాలు: నెలకొక పేజీ)

ఏ కేలండర్ కావాలో ఉదహరిస్తూ దాని ఖరీదును మనియార్డర్‌ద్వారాగాని, పోస్టల్ ఆర్డర్‌ద్వారాగాని పంపితే. రికార్డెడ్ డెలివరీపోస్టులో పంపగలము. రిజిస్టర్ పోస్టులో పంపగోరువారు అదనంగా రు. 1.50 పంపించితీరాలి.

**Cards Crafts Classics**
13/1, General Patters Road
Post Box No. 2421
MADRAS-600 002, INDIA
Grams: "CARDCRAFTS"
Phones: 812208 & 83792

"ఆ" అంది సుభద్ర నవ్వుతూ.

"రమ ఎప్పుడు వచ్చింది!"

"ఓ వారం అయింది."

"ఇప్పుడెక్కడేమిటీ వుండటం?"

"ఇదివరకు వున్నచోటే."

"రంగాపురమా!"

"అబ్బే! కాదు- మంగాపురం."

"అల్లుడు రాలా!"

"ఎందుకు రాలా?"

"ఏరీ లోపలున్నారా!"

"అబ్బే వెళ్ళిపోయారు."

"అప్పుడే! నిన్ననేగా పండగ."

"మరి ఇవాళేం చేస్తారు! ఆఫీసులేదూ!"

"అయితేమాత్రం - అత్తింటి అల్లుడు ఓ పది రోజులన్నా వుండకుండా!" అంది.

రమ ఓరగా నవ్వి తల్లివంక చూసింది. తాయారు మళ్ళీ-

"ఏంచేశారు పండక్కి!"

"లడ్డూ — బూంది"

"రెండూ ఒకటేగా"

"ఇది తీపి అదికారం రెండూ ఒకటెలా అవుతాయి?

"పులిహోర చెయ్యలేకపోయారా!"

సుభద్ర మాట్లాడలా.

"చీర లేం కొన్నారూ!" అంది.

రమ వినిపించుకోన్నట్లు ఊరుకొంది. మళ్ళీ సుభద్ర.

"దానికో ఫుల్‌వాయిల్ చీర కొన్నాం" అంది.

"అబ్బ! ఏం ఫుల్‌వాయిల్ బాబూ! మనుష్ల్ని మింగేసే వెడల్పు. గంజి పెట్టాలి! ఇస్త్రీ చెయాలి." రమ మాట్లాడలేదు.

లోపల నారాయణ మూలిగాడు. సుభద్ర లేచి పిల్లవాడికి ధారకం ఇచ్చి వచ్చింది.

"ఆ మూలు గెవరూ:"

"మా రెండోవాడు."

"జ్వరమా!"

"మరే."

"టైఫాయిడా. మామూలా!"

సుభద్రకి చిర్రెత్తుకొచ్చింది.

"అదికూడా ఎందుకు తల్లీ! ఊరికే నలతగా వుండి పడుకొన్నాడు" అంది.

తాయారు ఒకసారి పమిటతీసి ఎడం చేత్తో ఎత్తి పట్టుకొని రెండువేపులా జరీ అంచు సరిచేసుకు వేసు కొం ది. ఆవిడ మెళ్ళో అంచె లంచెలుగా నగలున్నాయి.

"ఈ చీర మా అమ్మ కొంది. నలభై అయిదు. చెప్పడం అరవై చెప్పాడు. ఎప్పుడు తీసుకొనే వాళ్ళమేగా: అందుకని తగ్గించి ఇచ్చాడు. ఇంకోటి నేరేడుపండుది కూడా తీసుకొంది మా అమ్మ. రేపు నే వెళ్ళేటప్పుడు పెట్టాలిగా" అంది.

"పెట్టొద్దూ ఆడపిల్లలకి" అంది సుభద్ర.

ఇంతలో రావుగారు ఒక కునుకు తీసి లేచి లోపలికి ఒక అడుగువేసి తాయారును చూసి వెనక్కి వెళ్ళారు. రమ లేచి కాఫీ పెట్టింది.

"నే వస్తానండీ!" అంది తాయారు.

"అయ్యో! కాస్త కాఫీ తాగి వెళ్ళు" అంది సుభద్ర.

"అబ్బా! కడుపంతా నిండుగా వుందండి ఇవాళ మా అమ్మ చక్కెర పొంగలి,గారెలు చేసింది" అంది కాని. కాఫీ త్రాగి మరీ వెళ్ళింది.

తల్లి . కూతురు హమ్మయ్య అని వూపిరి పీల్చుకొన్నారు. అందరూ సావిట్లో కాఫీ త్రాగుతుండగా పోస్ట్‌మాన్ వచ్చాడు. రావుగారు అందుకున్నారు. పెద్దవాడు సిరిపూర్ నుంచి వ్రాసిన కార్డు. కార్డుపై డేట్ చూసి రావుగారు "ఇ వా ళ తెచ్చావేమిటోయ్!" అన్నారు.

"నిన్న పండగ కదండీ! ఒకటే బీటుగా



తరువాత వచ్చుంటుంది" అన్నాడు. పోస్ట్‌మాన్ తాత్సారంచేస్తున్నాడు వెళ్ళకుండా. ఏదో కావాలి కామోసు. సుభద్ర లోపలి నుంచి కాగితపు సంచిలో బూంది. రెండు లడ్డులు తీసి తెచ్చియిచ్చింది. రమ విసుక్కుంది - ఏమిటి వాళ్ళకి కూడా!

"అ దే మి టి! వాళ్ళూ మనలాటివాళ్ళే. రోజూ మన యింటిచుట్టూ తిరుగుతూ వుంటారా పాపం" అంది.

వ సా రా లో రావుగారు కార్డు చదివి పెద్దగా నవ్వాడు. "అబ్బాయి వస్తున్నాడ్ట. పండగనాడు తెల్లవారక ముందే వుంటాడ్ట: ఏడీ! అన్నారాయన "

"మరయితే రాలేదేం? ఏ ప్రమాదమన్నా జరగలేదు కదా: పేపర్లో అంతా చూశారా? మళ్ళీ ఒకసారి చూడండి" అంది సుభద్ర ఆదుర్దాగా.

"నీమొహం. అనుమానాలు నువ్వూనూ! అయినా ఇవాళ పేపరు రాదుగా. సెలవు. నేచదివేది నిన్నటి సంచిక."

"అయ్యో ఏదయినా ఎలా తెలుస్తుందండీ ఇవాళ పేపరు రాకపోతే;"

"ఏదయినా ఏమీకాలేదు. వాడికి సెలవు దొరకలేదేమో!"

"సెలవు దొ ర క క పో తే వస్తానని ఎందుకు వ్రాస్తాడు" అంది. సుభద్ర మనసు ఆందోళనతో నిండిపోయింది. ఇంట్లో ఒక పిల్లాడికి సుస్తి పండగకి రాలేకపోతే సెలవు దొరకలేదేమో అనుకొందికాని ఇవాళ ఉత్తరం చదివితే మనసు ఆందోళనగా వుంది.

వాకిట్లో రోడ్డు ఊడ్చేవాళ్ళు. గుంపుగా వచ్చి పండగ మామూలండీ అని కేకవేశారు.

రావుగారు కళ్ళజోడు ముక్కుపై నొక్కిపెట్టి వారివంక చూసి.

"నిన్న ఇచ్చాంగా!" అన్నాడు.

"అబ్బే నిన్న ఇయ్యందే!

"ఇయ్యకపోవడ మేమిటి? పావలా. పావుశేరు బియ్యం ఇచ్చారుగా!

"మేం రాలేదండీ అసలు" అన్నారు వాళ్ళు.

ఇంతలో సుభద్ర లోపలి నుంచి వచ్చి.

"నిన్నటివాళ్ళు వేరులెండి. ఇదుగో అబ్బాయి. ఈ డబ్బులూ, ఇవీ పట్టుకుపొండ" అంది.

రావుగారు విసుక్కొంటూ.

"ఇలా ఇంట్లో వున్నది కాస్తా బయట పారబొయ్యడం, మెడ మీద కత్తి పెట్టి తెస్తావా. తేవా! అనడం ఇది నీ లక్షణం" అన్నారు.

సుభద్ర చురుకుగా చూసింది. ఏదో అనబోయింది. ఇంతలో లోపల్నుంచి నారాయణ పిల్చాడు.

"అమ్మా: ఉగాదినాడు ఎలా వుంటే సంవత్సరం అంతా అలా వుంటుం దంటారు కదే అమ్మా: మరి నాకు జ్వరం వచ్చిందేమే అమ్మా" అన్నాడు.

సుభద్ర నవ్వుకొని కుర్రవాడి దగ్గర కూర్చుని తల నిమురుతూ.

"తగ్గిపోతుందిలే నా న్నా:" అంది. వాడుకాస్త కళ్ళు మూసుకోగానే మళ్ళీ సాయంత్రం పని పిల్చింది సుభద్రని. రాత్రి ఏడుగంట లయేదాకా మళ్ళీ ఊపిరాడలేదు. ఇ ం త లో వాకిట్లో రిక్షా ఆగింది. పెద్దకొడుకు గిరి హడావుడిగా అమ్మా అమ్మా! అంటూ అరుస్తూ లోపలికి వచ్చాడు.

"ఏరా బాబూ వచ్చావా!" అంది సంతోషంగా. మళ్ళీ వెంటనే చల్లబడి:

"అదేమిటిరా! నిన్న పండగయితే ఇవాళ వచ్చావు. ఉత్తరం కూడా ఇవాళే వచ్చిందిలే!"

"భలే: పండగకనే బయలుదేరానమ్మా దారిలో ఓ కథ జరిగిందిలే! అంచేత రాలేకపోయాను నాన్నా! బండి ఏడున్నర గంటలు లేటండీ!"

"ఏమే రమా! కాంతుడేడీ! మా బావగారూ!" అన్నాడు గిరి.

"వెళ్ళిపోయారురా!" అంది రమ.

"బ్రతికాం పో! హాయిగా మనిద్దరం అరడజను తెలుగు సినిమాలు చూసేద్దాం. సరేగాని రైల్లో నాతోపాటు ఒక ముసలాయన ఎక్కాడే. పండగకి మనవడి దగ్గరికి వెళ్తున్నాట్ట. అతనికి ఎనభై ఆరు ఏళ్ళుట. నాకెంత ఆశ్చర్యం వేసిందో! నాతో చాలాసేపు కబుర్లు చెప్పాడు. మనవడు ఎలక్ట్రిసిటీ ఆఫీసులో హెడ్‌క్లర్కుట. మామిడికాయలు, కొత్త బట్టలు పట్టుకెళ్తున్నాట్ట. వ్యవసాయం చేస్తున్నాట్ట. తను ఎలా పైకి వచ్చింది కొడుకుల కెలా చదువులు చెప్పించింది చెప్తున్నాడు. ఇంతలో హఠాత్తుగా చలి జ్వరం వచ్చింది. వళ్ళు పేలిపోయింది. జంక్షనులో అతనిని దింపి నేనూ దిగిపోయాను. రాత్రంతా మందులు అవి వేసి కాపలాకాసి తెల్లవారి వాళ్ళ వూరు తీసుకెళ్ళి ఇల్లు కనుక్కొని అప్పచెప్పాను. వాళ్ళ మనవడు ఎంతో కృతజ్ఞత చెప్పాడు భోజనం చేస్తేకాని కదలనియ్యలేదు అదీ కథ.

"పాపం కబుర్లలో వూరూ పేరూ చెప్పాడు కనుక దింపి వచ్చావన్నమాట!" అంది కొడుకువంక గర్వంగా చూస్తూ.

గిరి సూట్‌కేస్ తెరిచి తల్లి చేతికో కాగితం పొట్లం ఇచ్చాడు-

"అమ్మా ఇది నీకే-అందులోనే నాన్నగారికి షర్టుకూడా వుంది. రమా నీకు పై నెలలోతెస్తానే!" అన్నాడు. రమతలూపి వెక్కిరించింది. సుభద్ర పాకెట్ విప్పి చూసింది. గులాబి రంగు చీరకి ఎర్రటి జరీ అంచు. చీర మెత్తగా గుప్పిటలో కొస్తుంది. ఇది నిన్న తెస్తేనా! మధ్యాహ్నం తాయారుకు చూపిస్తే సిగ్గుపడిపోయేది. దీనిముందు దాని చీర బలాదూరే అని మురిసిపోయింది. షర్టు, చీర చేతి మీద వేసుకొని రావుగారి దగ్గరకెళ్ళింది. రావుగారు దీర్ఘంగా ఆలోచిస్తున్నారు. చాలా సంవత్సరాల పట్టి ఈ పండుగలూ ఖర్చులూ గాడి తప్పించాలని పండగ వచ్చేదాకా ధృడ నిశ్చయంతో వుంటారు. అని వచ్చి సుభద్ర అవి ఇవి కావాలంటే ఏమీ అనలేరు. పైగా సుభద్ర పండుగ చేసుకోపోతే నలుగురిలో చిన్నతనంగా వుంటుందండీ! అని గోలపెడుతుంది. తరవాత ఖర్చులు తలంటిపోస్తాయి. అందులో సుభద్రకి సంవత్సరాది, దీపావళి అంటే ఎక్కువ ఇష్టం. ఈ రెండు పండగలూ రెక్కలు ముక్కలయేలా చాకిరీ చేసి ఏ లోటూ లేకుండా చేస్తుంది. ఆఉత్సాహం నీళ్ళు జల్లలేక వూరుకొంటారు. ఎన్ని తరహాలు మారినా, ఖర్చులు ఎలా పెరిగిపోతున్నా, ఎంత ముందుకు పోయినాం అనుకొన్నా ఈ పండగలు మనుష్యుల్ని నుంచోపెట్టి ఒకసారి ఆచారాల్ని, బాంధవ్యాల్ని, సంస్కృతిని వల్లెవేయించి మరీ వదుల్తాయి" ఇలా ఆలోచిస్తున్న రావుగారు భార్య పిలుపు విని కళ్ళు తెరిచారు. భార్య చేతిలో కొత్త బట్టలు చూసి.

"ఇవన్నీ ఏమిటిరా: నీకు మతి పని చేయడం లేదురా:" అన్నారు.

"అందుకే నాన్నా నాకు ఆఫీసరుపోస్టుకు ఆర్డర్సు వచ్చాయి" అన్నాడు గిరి.

"ఆ: ఆ: నిజంగా:" అన్నారు రావుగారు సుభద్ర ఒక్కసారిగా.

"మరి లేకపోతే ఎందుకుతెచ్చానేమిటి?"

"అయితే రేపు మళ్ళీ మనం ఉగాది చేసుకొందామే:" అంది రమ.

"రేపా: భలేదానివేనే! సరేగాని అమ్మా బొబ్బట్లు చేసి తీరాల్సిందే! గుత్తివంకాయలు చేయాల్సిందే! రమా, అమ్మ వంట చేస్తుంది నువ్వు ఉగాది పచ్చడిచేసి నాకు తలంటిపోయాలి"

"సరేలె రాత్రిళ్ళు తలంటు మాట అనకూడదు"

"అన్నయ్యా! నిన్న నువ్వు రాలేదనే బెంగతో అమ్మకి ఉగాది పచ్చడి తిన్నట్టే లేదట - రేపు మళ్ళీ ఉగాది." అంది రమ

రావుగారు నవ్వి -

"అవును, రేపే చేసుకుందాం. కాలెండరులో ఎర్ర అంకె వేయగానే పండుగ అయిపోతుందేమిటి? అప్పుడే చేసుకోవాలా; తెలియకుండా వచ్చే పండుగలు చాలా వుంటాయి జీవితంలో. మావాడు ఆఫీసరయితే నాకు క్రొత్త యుగారంభమే!" అన్నారు రావుగారు సుభద్ర వంకచూస్తూ సుభద్ర గిరివంక చూస్తోంది - గిరి రమ వంక చూస్తున్నాడు. లోపల పడుకున్న నారాయణ మెల్లగాలేచి వచ్చి గుమ్మం పట్టుకొని వాన వెలిశాక వచ్చిన వెలుగురేకలా తెల్లగా నవ్వుతున్నాడు. రమ వాడి వంక చూస్తోంది

★


ఫెంచి

ఉచిత పోస్టలు ట్యూషన్ 4 మాసముల సర్టిఫికెట్ కోర్సు. వివరములకు సొంత చిరునామా కలిగిన పోస్టలు కవరు పంపండి.

Principal
IMPERIAL
INSTITUTES (PLF)
Doriwalan, Delhi-5.

ఉచితం ఉచితం ఉచితం

తెల్ల మచ్చలు

ఏ రకం తెల్లమచ్చలైనాసరే వాని రంగు మరియు ఎర్రమచ్చల రంగు మా ప్రఖ్యాత ఔషదం "డాగ్ వినాశక్" వాడిన యెడల మూడు దినములలో మారును, అటుపైన మామూలు చర్మమువలె నుండిపోవును. ప్రచారం కొరకు 1 సీసా మందు ఉచితముగా పంపెదము. వెంటనే వ్రాయండి.

JIWAN KALYAN ASHRAM-8
P. O. KATRI SARAI (GAYA)

చెరుకూరి రమాదేవి

| | | |
|---|---|---|
| ఆటబొమ్మలు | నవల | 7.50 |
| పయనించేపడవ | " | 7.50 |
| బాంధవ్యబందితులు | " | 7.50 |

కురుమద్దాలి విజయలక్ష్మి
నేటియువతరాన్ని ఆకర్షించే నవలలు

| | | |
|---|---|---|
| కథానాయకి | " | 8.00 |
| అలివేణి | " | 8.00 |
| మారనికాలంలోమారినమనుషులు | | 8.00 |
| అశోకవనంలోసీత | " | 7.50 |
| ఓ స్త్రీ నీ అంతరంగం ఇదా? | " | 6.00 |

కావిలిపాటి విజయలక్ష్మి

| | | |
|---|---|---|
| అపశృతులు | " | 6.00 |
| చాకులాంటిలేఖ | " | 6.00 |
| పెంపుడు కొడుకు | " | 6.00 |
| రేడియో రామాయణం. ఉషశ్రీ | | 15.00 |
| కార్యానాఖ్యానము. నండూరి పార్థసారథి | | 6.50 |
| విజయ. కౌముది | | 7.00 |

న్యూస్టూడెంట్సుబుక్‌సెంటర్
ఏలూరురోడ్, విజయవాడ-2